


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

| శనివారం 12 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 102 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
| --- | --- | --- | --- | --- | --- |




## ఏపీ, తెలంగాణలో వర్ష హెచ్చరికలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌పై అల్పపీడనం కొనసాగుతున్న నేపథ్యంలో నేడు ఉత్తరాంధ్రలో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్తరాంధ్రతో పాటు ఏపీలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. మరోవైపు తెలంగాణలోనూ నేడు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు సమాచారం. ఆయా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పాటు గంటకు 40 కిలోమీటర్ల లోపు వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పిడుగులు పడే సమయంలో ప్రజలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు వాతావరణ శాఖ, జిల్లా అధికారుల సూచనలు పాటించాలని అధికారులు కోరారు.



## విద్య ఒక్కటే తలరాతను మార్చుతుంది.. పాలిటెక్నిక్‌ల ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: విద్య ఒక్కటే మన జీవితాల్లో వెలుగును తీసుకురాగలదని, వ్యక్తుల తలరాతను మార్చే శక్తి విద్యకే ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర విద్యా విధానంపై శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చకు ఆయన సుదీర్ఘంగా సమాధానం ఇచ్చారు. విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణలు, పాలిటెక్నిక్ విద్యలో మార్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుదల తదితర అంశాలపై సభలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సీఎం స్పష్టత ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తారనే ప్రచారాన్ని ఆయన ఖండిస్తూ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పాలిటెక్నిక్‌లు ఇకపై కూడా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతాయని స్పష్టం చేశారు. సాంకేతిక విద్యా వ్యవస్థను స్కిల్స్ యూనివర్సిటీ పరిధితో అనుసంధానం చేయడం వెనుక విద్యార్థులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఉద్దేశమని తెలిపారు. పాలిటెక్నిక్‌లకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 97పై విద్యార్థుల్లో నెలకొన్న అనుమానాలను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అవసరమైతే నిపుణులు, సభ్యులు ఇచ్చే సూచనల ఆధారంగా మార్పులు చేస్తామని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలోని 59 పాలిటెక్నిక్ కళాశాలలను టాటా టెక్నాలజీస్ సహకారంతో రూ.4 వేల కోట్లతో ఆధునీకరిస్తున్నామని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలకు అనుగుణంగా కోర్సులను ఆధునీకరించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు, ప్రాక్టికల్ శిక్షణ అవకాశాలను పెంచుతామని పేర్కొన్నారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తూ టాటా సంస్థ సహకారంతో నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, దీనిని ప్రైవేటీకరణగా భావించరాదన్నారు. ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్కాలర్‌షిప్ అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వం అదనంగా 282 ఎకరాల భూమిని ఏటీసీలకు కేటాయించిందని, ఒక్కో ఏటీసీపై సుమారు రూ.46 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నామని వివరించారు. పేద విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వబోమని, వారి భవిష్యత్తును మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారాన్ని విడిచిపెట్టే నాటికి రూ.5,435 కోట్ల బకాయిలు ఉన్నాయని, అందులో గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బకాయిల నుంచి రూ.1,410 కోట్లు తమ ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.1,465 కోట్లు చెల్లించామని, ఈ విద్యా సంవత్సరంలో చెల్లించిన మొత్తాలతో కలిపి 32 నెలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం మొత్తం రూ.3,488 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ విధానాన్ని అమలు చేస్తున్నామని, ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల కోసం ముందస్తుగా గ్రీన్‌చానల్‌లో నిధులు అందిస్తున్నామని చెప్పారు. విజిలెన్స్ నివేదికలను పరిశీలించిన అనంతరం అర్హత కలిగిన కాలేజీల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడతలవారీగా చెల్లిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని రూపొందించేందుకు తెలంగాణ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కమిషన్ సమర్పించిన నివేదికను పరిశీలించేందుకు కే. కేశవరావు నేతృత్వంలో కమిటీని నియమించినట్లు తెలిపారు. సభ్యులు, విద్యా రంగ నిపుణులు తమ సూచనలు, సలహాలను కమిటీకి అందించాలని, వాటిని పరిశీలించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యాశాఖను తాను స్వయంగా నిర్వహించడం ద్వారా ఆ శాఖకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతుందని చెప్పారు. 2023–24లో గత ప్రభుత్వం విద్యాశాఖకు రూ.19,093 కోట్లు కేటాయించగా, తమ ప్రభుత్వం 2024–25లో రూ.21,292 కోట్లు, 2025–26లో రూ.23,108 కోట్లు, 2026–27లో రూ.26,647 కోట్లు కేటాయించిందని తెలిపారు. మూడేళ్లలో విద్యాశాఖ బడ్జెట్‌ను రూ.7,554 కోట్ల మేర పెంచామని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 55 రోజుల్లో 10,006 మంది ఉపాధ్యాయులను నియమించామని, గత ప్రభుత్వం పదేళ్లలో 7,857 మంది ఉపాధ్యాయులను మాత్రమే నియమించిందని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 86 వేల మేర పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా ప్రీ-ప్రైమరీ విధానాన్ని ప్రారంభించామని, ఈ ఏడాది 64 వేల మంది విద్యార్థులకు ప్రీ-ప్రైమరీ విద్య అందిస్తున్నామని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జెన్‌జీతో పాటు భవిష్యత్‌లో వచ్చే జెన్‌ఆల్ఫా, జెన్‌బీటా తరాలను దృష్టిలో ఉంచుకుని నూతన విద్యా విధానాన్ని రూపొందిస్తున్నామని సీఎం తెలిపారు. "దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది.. తలరాతలను మార్చేది విద్య" అనే నమ్మకంతో విద్యా రంగంలో సంస్కరణలు చేపడుతున్నామని, ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా విధానాలు, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను తెలంగాణకు తీసుకువచ్చి దేశానికి రాష్ట్రాన్ని విద్యా రంగంలో రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.




## నేడు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ శాసనసభ సమావేశాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నేడు తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించనున్నారు. అసెంబ్లీలో తమకు మాట్లాడే అవకాశం కల్పించకుండా సస్పెండ్ చేశారనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మాక్ అసెంబ్లీలో అసెంబ్లీ తరహాలోనే సభా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్‌గా మాణిక్యరావు వ్యవహరించనుండగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించనున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాక్ అసెంబ్లీలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, అసెంబ్లీలో తమపై తీసుకున్న చర్యలపై చర్చించే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్ నేపథ్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.



## త్రిప్రయార్ శ్రీ రామస్వామిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

త్రిశూర్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుక్రవారం కేరళలోని ప్రసిద్ధ త్రిప్రయార్ శ్రీ రామస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ శుక్రవారం సాయంత్రం త్రిశూర్ జిల్లాలోని త్రిప్రయార్ చేరుకుని శ్రీ రామస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ నిర్వాహకులు, సిబ్బంది స్వాగతం పలికారు. శ్రీరామస్వామి దర్శనానికి ముందు ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణుడి సన్నిధిలో కూడా పవన్ కళ్యాణ్ ప్రార్థనలు చేసినట్లు తాజా నివేదికలు పేర్కొన్నాయి. అనంతరం శ్రీ రామస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కేరళలోని త్రిశూర్ జిల్లాలో ఉన్న త్రిప్రయార్ శ్రీ రామస్వామి ఆలయం ప్రముఖ రామాలయాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో శ్రీరాముడు ప్రధాన దైవంగా కొలువుదీరగా, నాలుగు చేతులతో శంఖం, చక్రం, విల్లు, మాల ధరించిన రూపంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ చరిత్రకు సంబంధించిన వివరాలు పేర్కొంటున్నాయి. త్రిప్రయార్ ఆలయం కేరళలోని ప్రసిద్ధ నాలంబలం యాత్రలో ముఖ్యమైన తొలి క్షేత్రంగా పరిగణించబడుతుంది. ఈ యాత్రలో శ్రీరాముడు, భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడికి అంకితమైన నాలుగు ఆలయాలను క్రమంగా దర్శించుకోవడం సంప్రదాయంగా ఉంది.పవన్ కళ్యాణ్ ఆలయ దర్శనానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారాయి. ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తలు పవన్ కళ్యాణ్ ఆలయ దర్శనంపై భక్తిశ్రద్ధలతో స్పందిస్తున్నారు. కేరళ పర్యటనలో భాగంగా పవన్ కళ్యాణ్ ఆలయ దర్శనం ప్రాధాన్యత సంతరించుకుంది.

## తెలంగాణ కుల సర్వే దేశానికే రోల్ మోడల్.. 2027 జనగణనలో బీసీ కులగణన చేర్చాలి: పొన్నం



హైదరాబాద్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణలో నిర్వహించిన సమగ్ర కుల సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 2027లో నిర్వహించనున్న జాతీయ జనగణనలో బీసీ, ఓబీసీలకు సంబంధించిన కుల వివరాలను తప్పనిసరిగా చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీల జనాభా, సామాజిక పరిస్థితులకు సంబంధించి తెలంగాణ వద్ద ప్రస్తుతం ప్రామాణిక గణాంకాలు ఉన్నాయని, ఈ గణాంకాల ఆధారంగానే బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల విషయంలో మరింత సమర్థవంతమైన విధానాలు రూపొందించవచ్చని తెలిపారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే కచ్చితమైన జనాభా గణాంకాలు అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రిజర్వేషన్ల పరిమితిని అధిగమించే అంశంలోనూ కుల జనాభా గణాంకాలు కీలకంగా మారుతాయని చెప్పారు. 2027 జనగణనలో బీసీ, ఓబీసీ వివరాలను స్పష్టమైన కేటగిరీలతో నమోదు చేయాలని, దేశవ్యాప్తంగా బీసీల వాస్తవ జనాభా ఎంత ఉందో అధికారికంగా లెక్కించాలని డిమాండ్ చేశారు. కులగణన సమాజాన్ని విభజించేందుకు కాదని, సామాజిక అసమానతలను గుర్తించి వాటి ఆధారంగా సంక్షేమ, సామాజిక న్యాయ విధానాలను రూపొందించేందుకు అవసరమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీల జనాభాను లెక్కించి వారికి జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.



## కొత్తగూడెం మేజర్ కాలువకు తక్షణమే నీటిని విడుదల చేయాలి ఎండిపోతున్న వరి పొలంలో రైతుల వినూత్న నిరసన

అనంతగిరి, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: కొత్తగూడెం మేజర్ కాలువకు తక్షణమే నీటిని విడుదల చేసి చెరువులను నింపడంతో పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని గొండ్రియల ఉపసర్పంచ్ బండ్ల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగునీరు అందక ఎండిపోతున్న వరి పొలంలో రైతులు మోకాళ్లపై కూర్చొని దండం పెడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బండ్ల రమేష్ మాట్లాడుతూ ముత్యాల బ్రాంచ్ కెనాల్‌కు గత 15 రోజులుగా నీరు విడుదలవుతున్నప్పటికీ కొత్తగూడెం మేజర్ కాలువకు మాత్రం నీటిని విడుదల చేయకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కాలువ కింద సాగు చేస్తున్న రైతులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఇప్పటికే వరి సాగు కోసం ఎకరాకు సుమారు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ప్రస్తుతం నీరు అందక పంటలు ఎండిపోతే తమ పరిస్థితి ఏమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో రైతే రాజు అంటూ ప్రభుత్వాలు చెబుతున్నాయని, రైతులను రాజులను చేయకపోయినా తమను బికారులుగా మాత్రం మార్చవద్దని కోరారు. సంబంధిత అధికారులు తక్షణమే కొత్తగూడెం మేజర్ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని, తద్వారా భూగర్భ జలాలు పెరిగి బోర్ల ద్వారా పంటలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలను కాపాడేందుకు అధికారులు వెంటనే స్పందించి కాలువకు నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్ల కరుణ, బండ్ల నరేష్, నేలకుర్తి పుల్లారావు తదితరులు పాల్గొని రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.




## రెవెన్యూ సేవల్లో వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: జిల్లాలో రెవెన్యూ సేవలను మరింత వేగవంతం చేసి ప్రజలకు సత్వర న్యాయం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజావాణి, భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో భూభారతి, ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్రామ సర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా చేపట్టాలని, తహసీల్దార్లు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి వారం పురోగతి నివేదికలను అందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు అధునాతన కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గతంలో గంటల సమయం పట్టే నివేదికలు, డ్రాఫ్టింగ్ వంటి పనులను ఆధునిక సాంకేతికత సహాయంతో తక్కువ సమయంలోనే నాణ్యతతో పూర్తి చేయవచ్చని, దీనివల్ల అధికారుల పనిభారం తగ్గడంతో పాటు ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మండలాల వారీగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన భూసమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక జాబితా రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులతో పాటు 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న భూభారతి కేసులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, వేగంగా అందేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ ఇవ్వకపోతే జాతీయ రహదారి దిగ్బంధం, సబ్‌స్టేషన్ల ముట్టడి: బొల్లం మల్లయ్య యాదవ్





సూర్యాపేట, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రైతులను ఆదుకోవాలనే కనీస ఆలోచన, చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. విద్యుత్ కోతలు, నాణ్యత లేని విద్యుత్ కారణంగా ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి సూర్యాపేట జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందజేసిన అనంతరం ఎస్ఈ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లోనూ రైతులు ఆందోళనకు గురవుతున్నారని, అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతుల కళ్ల ముందే పచ్చని పంటలు ఎండిపోతుండటంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. నీళ్లు, కరెంటు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పంటలు పండితే ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తుందని, బోనస్ చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతో పంటలు పండకుండా చేయాలనే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలను పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అప్రకటిత విద్యుత్ కోతలు, నాణ్యత లేని విద్యుత్ సరఫరా కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్లు, రైతుల మోటార్లు కాలిపోతున్నాయని, వాటిని మరమ్మతులు చేయించుకునేందుకు రైతులు వారాల తరబడి మెకానిక్ షాపుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేదని, ప్రస్తుతం ఎప్పుడు విద్యుత్ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని అన్నారు. వెంటనే విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరిచి రైతులకు రోజుకు 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించాలని, చెరువులను నింపి భూగర్భ జలాలను పెంచేందుకు నిరంతరాయంగా సాగర్ జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వరి పంటల కోతలు పూర్తయ్యే వరకు సాగర్ నీటిని ఆయకట్టుకు ఏ విధంగా విడుదల చేస్తారో తెలియజేస్తూ వెంటనే నీటి విడుదల షెడ్యూల్ (క్యాలెండర్) ప్రకటించాలని కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించిన విధంగా ఈ నెల 14వ తేదీలోపు నీటి విడుదల క్యాలెండర్ ప్రకటించాలని, లేనిపక్షంలో పాదయాత్ర చేపట్టాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఎస్ఈని కలిసి రైతుల సమస్యలను వివరించామని, కిందిస్థాయి అధికారులు పైస్థాయి నుంచి వచ్చిన ఆదేశాలను మాత్రమే అమలు చేస్తున్నామని చెబుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు, మంత్రులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారని అన్నారు. మరో మూడు, నాలుగు రోజులు పరిస్థితిని గమనిస్తామని, అప్పటికీ విద్యుత్ సరఫరా మెరుగుపడకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల సమన్వయంతో జాతీయ రహదారులను దిగ్బంధిస్తామని, నియోజకవర్గంలోని అన్ని సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులను వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గం గడ్డిపల్లి, కోదాడ నియోజకవర్గం చిలుకూరు, తుంగతుర్తి నియోజకవర్గం తొండ గ్రామాల్లో మొత్తం మూడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం చేపడుతున్నామని, ఒక్కో పాఠశాల నిర్మాణానికి సుమారు రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.600 కోట్ల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆయా పాఠశాలల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సంబంధిత ఆర్కిటెక్చర్ డిజైన్ ప్రకారం నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మిగిలిన సమగ్ర శిక్ష అభియాన్ పనులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ భాను ప్రసాద్, డీఈఓ అశోక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ కుమార్, ఏఈ ఓబులేష్, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 12, 13న ప్రత్యేక ఓటరు ప్రచార కార్యక్రమం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)-2026 కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఈ రెండు రోజుల పాటు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు అందుబాటులో ఉండి ఓటర్లకు అవసరమైన సేవలు అందిస్తారని తెలిపారు. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు, పేరు తొలగింపు, అభ్యంతరాలు, చిరునామా లేదా ఇతర వివరాల సవరణలకు సంబంధించిన ఫారం-6, ఫారం-7, ఫారం-8తో పాటు అవసరమైన డిక్లరేషన్ ఫారాలను పోలింగ్ కేంద్రాల్లో స్వీకరిస్తారని వివరించారు. ప్రతి ఓటరు తమకు సమీపంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి SIR-2026 డ్రాఫ్ట్ నోటిఫికేషన్, ASD జాబితాలో తమ పేరు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం-6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం ఫారం-7, పేరు, చిరునామా తదితర వివరాల సవరణలకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. SIR ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్ లేదా అనామలీస్ కింద నోటీసులు అందుకున్న ఓటర్లు వాటిని నిర్లక్ష్యం చేయకుండా బీఎల్ఓలకు అవసరమైన ఆధార పత్రాలను సమర్పించాలని స్పష్టం చేశారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా బీఎల్ఓలు ప్రక్రియను పూర్తిగా వివరించి సహకరించాలని ఆదేశించినట్లు తెలిపారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న లేదా ఆ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న అర్హత కలిగిన యువత తమ పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో పరిశీలించుకోవాలని, పేరు నమోదు కాకపోతే ఫారం-6తో పాటు డిక్లరేషన్ సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, ఎన్నికల సిబ్బంది రాజేందర్ రెడ్డి, భరత్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

సూర్యాపేట, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: క్రిస్టియన్ మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచితంగా గ్రాఫిక్ డిజైన్ విత్ ఏఐ టూల్ కోర్సులో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి అర్హులైన క్రిస్టియన్ మైనారిటీ యువతీ యువకులకు ఈ శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు క్రిస్టియన్ మైనారిటీ బీసీ-సీ సర్టిఫికెట్ లేదా బాప్టిజం సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, పట్టణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షల్లోపు, గ్రామీణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల్లోపు ఉండాలని, ఆదాయ ధ్రువీకరణ పత్రం మీ-సేవ ద్వారా జారీ చేయబడినదై ఉండాలని సూచించారు. కోర్సుకు అనుగుణంగా ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. గతంలో ప్రభుత్వం ద్వారా ఏదైనా వృత్తి విద్యా శిక్షణ పొందిన వారు ఈ శిక్షణకు అనర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రిస్టియన్ మైనారిటీ యువతీ యువకులు అవసరమైన అర్హత పత్రాలతో సెప్టెంబర్ 19, 2026లోపు కార్యాలయ పని వేళల్లో దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి విశాల్ ధార్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని లేదా 9492611057, 89666499929 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



## ఆయుష్ వైద్య సేవలను విస్తృతంగా ప్రజలకు అందించాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధ్యక్షతన వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశం నిర్వహించగా, సూర్యాపేట జిల్లాలో ఆయుష్ ఆధ్వర్యంలో అందిస్తున్న వైద్య సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఆయుర్వేదం, యునాని, హోమియోపతి తదితర ఆయుష్ వైద్య విధానాలపై ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సేవలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఔషధ చికిత్సతో పాటు అవసరమైన సందర్భాల్లో పంచకర్మ వంటి సాంప్రదాయ చికిత్సా విధానాలను శాస్త్రీయ వైద్య ప్రమాణాలకు అనుగుణంగా వినియోగిస్తూ వివిధ రుగ్మతల నివారణ, నియంత్రణకు కృషి చేయాలని ఆయుష్ వైద్యులకు సూచించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు, పంచకర్మ చికిత్సా సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని, ఆయుష్ వైద్యులు తమ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఆయుష్ వైద్య సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మందుల సమకూర్పు కోసం అవసరమైన నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. జిల్లాలో ఆయుష్ మోడల్ వైద్యశాల నిర్మాణానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఆదేశించారు. ఇదే సమయంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న మాతా శిశు సంరక్షణ, వ్యాధినిరోధక టీకాలు, ఆర్బీఎస్‌కే తదితర కార్యక్రమాల అమలు తీరును సమీక్షించిన కలెక్టర్, ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ప్రతి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను ఆర్బీఎస్‌కే ద్వారా గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ, జిల్లా స్థాయి పీసీపీఎన్‌డీటీ అప్రోప్రియేట్ అథారిటీ సమావేశంలో ఒక స్కాన్ సెంటర్ రిజిస్ట్రేషన్‌కు ఆమోదం లభించిందని, ప్రైవేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లకు చట్టపరమైన నిబంధనల ప్రకారం అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం అనుమతులు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకట రమణ, ఐఎంఏ అధ్యక్షుడు డా. రమేష్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. మాధవ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డా. కోటి రత్నం, డా. నాజియా తబస్సుం, డా. శ్రీశైలం, డా. నాగరాజు, వి. సంజీవ్ రెడ్డి, శ్రీమతి ఉమా మహేశ్వరి, శ్రీ భార్గవ్, ఆయుష్ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి వినాయక ప్రతిమల తయారీతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన: తారా ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం




సంగారెడ్డి, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల (ఏ)లో ఈకో క్లబ్ ఆధ్వర్యంలో 'క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ మాట్లాడుతూ మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేసి పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున సహజమైన మట్టితో తయారు చేసిన ప్రతిమలను వినియోగించడం పర్యావరణహితమైన విధానమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు పర్యావరణహిత పండుగల నిర్వహణపై చైతన్యం కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈకో క్లబ్ కన్వీనర్ డా. బి. సోఫియా రాణి, వైస్ ప్రిన్సిపాల్ డా. సుచిత్రా సింగ్, ఇతర అధ్యాపకులు కార్యక్రమంలో పాల్గొనగా, విద్యార్థులు ఉత్సాహంగా మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. "మట్టి వినాయకుడు – పర్యావరణానికి మేలు, మన ఆరోగ్యానికి మేలు" అనే సందేశాన్ని విద్యార్థులు సమాజానికి అందించారు. కార్యక్రమం ద్వారా నీటి కాలుష్య నివారణ, ప్లాస్టిక్ మరియు రసాయన రహిత పండుగల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## 18–55 ఏళ్ల బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు సెప్టెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: జిల్లాలోని బీసీ మహిళలను ఆర్థికంగా స్వావలంబులను చేసేందుకు 'ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ' పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల కోసం అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. అర్హత కలిగిన మహిళలు tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, సెప్టెంబర్ 15 చివరి తేదీ అని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల వయస్సు 18 సంవత్సరాలు నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగులు, నిరుపేదలు, నిరాధరణకు గురైన వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, అనాథ మహిళలు, టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారులు నివాస, కుల, ఆదాయ, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని పేర్కొన్నారు. దరఖాస్తులు అధికంగా వచ్చిన పక్షంలో కనీస విద్యార్హత ఐదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పిస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉన్నవారు అర్హులని వివరించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు ఈ పథకానికి అర్హులు కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు చేసుకుని కులం, ఆదాయం, నివాసం, ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హత, టైలరింగ్ శిక్షణ, అనుభవానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి గ్రామీణ ప్రాంతాల వారు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతాల వారు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.



## పేదరికాన్ని అధిగమించి ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి ఎస్పీ నరసింహ అండ: రూ.20 వేల ఆర్థిక సహాయం

సూర్యాపేట, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: ప్రభుత్వ గురుకులంలో చదువుకుని నీట్‌లో మంచి ర్యాంక్ సాధించి గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన మామిడి ఇందుకు సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ మానవతా దృక్పథంతో రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే పట్టుదలతో చదివి వైద్య విద్యలో సీటు సాధించిన ఇందును ఎస్పీ అభినందించి, ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మామిడి అంజయ్య, ప్రసన్న దంపతుల కుమార్తె అయిన ఇందు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు, హైదరాబాద్‌లోని గౌడిగూడలో ప్రభుత్వ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసి, నీట్‌లో మంచి ర్యాంక్ సాధించి గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు పొందారు. ఇందు తండ్రి అంజయ్య దివ్యాంగుడు కాగా ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక స్కావెంజర్‌గా పనిచేస్తుండగా, తల్లి ప్రసన్న దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందినప్పటికీ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇందు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈ విజయాన్ని సాధించారు. ఇందు చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం సోషల్ మీడియాలో వెలుగులోకి రావడంతో స్పందించిన ఎస్పీ నరసింహ తన కార్యాలయంలో ఇందును పిలిపించి ఆమె విద్యాభ్యాసానికి తన వంతు సహాయంగా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందినప్పటికీ ఎన్నో కష్టాలను అధిగమించి పట్టుదలతో చదివి నీట్‌లో మంచి ర్యాంక్ సాధించి ఎంబీబీఎస్ సీటు పొందడం ఎంతో అభినందనీయమని అన్నారు. దివ్యాంగుడైన తండ్రి తన కుమార్తెను కష్టపడి చదివించి ఈ స్థాయికి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇందు తన వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి మంచి వైద్యురాలిగా ఎదిగి, ముఖ్యంగా పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివే విద్యార్థులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందని, ఇందు విద్యాభ్యాసంలో భవిష్యత్తులో ఏదైనా సహాయం లేదా సమస్య ఎదురైతే తనను సంప్రదించవచ్చని, తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఎస్పీ భరోసా ఇచ్చారు. "పేదరికం లక్ష్యానికి అడ్డంకి కాదు.. పట్టుదల, కష్టపడి చదివే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చు" అనే విషయాన్ని ఇందు తన విజయంతో నిరూపించారని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం పాల్గొన్నారు.



## ఖజానా నిర్వహణలో నిబంధనలు, పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి: సీనియర్ డీఏజీ ఎం. నరేష్ కుమార్

సంగారెడ్డి, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎం. నరేష్ కుమార్ (ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్) సంగారెడ్డి జిల్లా ఖజానా కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ నుంచి కొనసాగుతున్న వార్షిక ఆడిట్‌లో భాగంగా చివరి రోజున జిల్లా ఖజానా కార్యాలయాన్ని సందర్శించిన ఆయన వివిధ రికార్డులు, రిజిస్టర్లు, ఆర్థిక లావాదేవీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలో పనిచేస్తున్న ఏటీఓలు, ఎస్‌టీఓలతో సమావేశమై ఖజానా నిర్వహణ, ఆడిట్ అంశాలు, కార్యాలయ విధుల అమలు తీరుపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలు, ప్రస్తుత ఆడిట్ అభ్యంతరాలతో పాటు కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, విధుల అమలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. IFMIS పోర్టల్ ద్వారా పేపర్‌లెస్ ఆన్‌లైన్ బిల్లుల సమర్పణ జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు, సిబ్బంది విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఎలాంటి లోపాలకు తావులేకుండా బిల్లుల ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. పెన్షనర్లకు సంబంధించిన పెన్షన్ చెల్లింపుల ప్రక్రియను సక్రమంగా, సకాలంలో పూర్తి చేయాలని, నెలవారీ ఖాతాలను నిర్ణీత గడువులోగా అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఖజానా కార్యాలయాల్లో రికార్డులు, రిజిస్టర్లు, ఆర్థిక లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి భద్రపరచాలని, ప్రభుత్వ నిధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ఆర్థిక క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా ఖజానా కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, విధుల అమలు, ఆడిట్ ప్రక్రియకు సంబంధించి చేపడుతున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఏటీఓలు, ఎస్‌టీఓలు సంపత్, స్వరూప్, రాజారెడ్డి, శారదతో పాటు జిల్లా ఖజానా కార్యాలయంలోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

## కేసుల దర్యాప్తులో జాప్యం వద్దు.. పెండింగ్ కేసులను సకాలంలో పూర్తి చేయాలి: మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లాలో దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, కేసులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా దర్యాప్తు పూర్తి చేసి సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో సంఘటనా స్థలంలో లభించే ఆధారాలను పకడ్బందీగా సేకరించి, శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగిస్తూ నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా బలమైన కేసులు నమోదు చేయాలని తెలిపారు. మిస్సింగ్ కేసుల్లో ప్రత్యేక దృష్టి సారించి బాధితుల ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని, ఎన్‌బీడబ్ల్యూ కేసుల్లో వారెంట్ల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. రాబోయే వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపట్టాలని, మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వీపీఓల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని, నిమజ్జన మార్గాలు, రద్దీ ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన ఐఓలు రేణుకరెడ్డి, వెంకటరాజాగౌడ్, రంగా కృష్ణతో పాటు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. సమావేశంలో డీఎస్పీలు సుభాష్‌చంద్రబోస్, నరేందర్‌గౌడ్, సీఐలు రేణుక, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరాజాగౌడ్, జార్జ్, సందీప్‌రెడ్డి, కృష్ణమూర్తి, రంగా కృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని రైతుల రాస్తారోకో.. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల మండిపాటు

మెదక్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: విద్యుత్ కోతల కారణంగా సాగు చేసిన పంటలకు సకాలంలో నీరు అందడం లేదని ఆరోపిస్తూ మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రైతులు, బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. కౌడిపల్లి మండలం వెంకట్రావుపేట్ గేట్ వద్ద రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు నేషనల్ హైవే 765డీపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సాగు కోసం బోర్లు, వ్యవసాయ మోటార్లపై ఆధారపడుతున్న తమకు నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో కీలకమని, అయితే విద్యుత్ కోతల కారణంగా మోటార్లు పనిచేయక పంటలకు సకాలంలో నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల కోసం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశామని, ప్రస్తుతం పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు వాపోయారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేసి పంటలను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని, లేకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



## తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమన్వయంతోనే విద్యార్థినుల సమగ్ర ప్రగతి: ప్రిన్సిపాల్ హేమబిందు

సిద్దిపేట, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ సిద్దిపేట ప్రతినిధి: సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినుల విద్యా ప్రగతి, హాజరు, క్రమశిక్షణ, భవిష్యత్ లక్ష్యాలపై తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హేమబిందు మాట్లాడుతూ విద్యార్థినుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల సహకారం ఎంతో కీలకమని, వారి హాజరు, చదువులో సాధిస్తున్న ఫలితాలు, ప్రవర్తనపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థినుల సమగ్ర అభివృద్ధికి కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో విద్యార్థినులలో ఉన్న బలాలు, మెరుగుపరచాల్సిన అంశాలు, చదువులో మరింత పురోగతి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ లక్ష్యాలను చేరుకునేందుకు అవసరమైన ప్రణాళికలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థినుల ప్రతిభను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందిస్తూ విద్యతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి కృషి చేయాలని సమావేశంలో సూచించారు.




## మధ్యాహ్న భోజన బిల్లులను కులాల వారీగా చెల్లించడం సిగ్గుచేటు: సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

మెదక్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం బిల్లులను కులాల వారీగా విభజించి చెల్లించడం సిగ్గుచేటని, వెంటనే ఆ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తినే మధ్యాహ్న భోజన బిల్లులను కులాల వారీగా విభజించడం వల్ల చిన్నారుల్లో కుల వివక్ష భావనలు పెరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కుల రహిత సమాజ నిర్మాణం వైపు పిల్లలను తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలతో వారి మనసుల్లో కులం అనే విషవృక్షాన్ని నాటే పరిస్థితి తీసుకురావడం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపులో కులాల వారీ విభజన విధానాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులను సర్పంచులు, కార్యదర్శులు వేధిస్తున్నారని, కార్మికులపై వేధింపులకు పాల్పడటం సరికాదని అన్నారు. శాంతియుతంగా నిరసనలు, ఆందోళనలు నిర్వహించే కార్మికుల హక్కులను ప్రభుత్వం అణచివేసే విధంగా నిర్బంధ చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్బంధ చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షల్లో జిల్లాలోని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చుక్క రాములు పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి, జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం, జిల్లా కోశాధికారి నర్సమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, కడారి నాగరాజు, నాయకులు గౌరయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ మహిపాల్ కుటుంబానికి పోలీసు శాఖ అండ.. రూ.4.21 లక్షల ఆర్థిక సాయం అందజేత

మెదక్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శివంపేట పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మహిపాల్ కుటుంబానికి జిల్లా పోలీసు శాఖ అండగా నిలిచింది. మహిపాల్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి సేకరించిన రూ.4.21 లక్షల ఆర్థిక సాయం చెక్కును శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ మహిపాల్ కుటుంబ సభ్యులకు అందజేశారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిపాల్ మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తమ వంతుగా ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహిపాల్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. వారు కూడా పోలీసు కుటుంబంలో భాగమేనని, ఎలాంటి సమస్య ఎదురైనా నేరుగా తనను సంప్రదించవచ్చని, పోలీసు శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మహిపాల్‌కు సంబంధించి శాలరీ అకౌంట్ ద్వారా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. అలాగే మహిపాల్ భార్యకు ఉద్యోగం త్వరగా లభించేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి మహిపాల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## వర్షాభావంతో ఎండిపోతున్న వరి పొలాలు.. నీటి కోసం రైతుల ఆందోళన

నారాయణఖేడ్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ నారాయణఖేడ్ ప్రతినిధి: కల్హేర్ మండలం కృష్ణాపూర్, ఖానాపూర్, ఇంద్రానగర్ పరిధిలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుకు అవసరమైన నీరు అందుబాటులో లేకపోవడంతో పొలాల్లో నెర్రెలు ఏర్పడి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత ఏర్పడటంతో తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని, ఇప్పటికే సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. పంటలను కాపాడుకునేందుకు నీటి కోసం ఎదురుచూస్తున్నప్పటికీ తగిన నీటి వసతి లేకపోవడంతో పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోందని తెలిపారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపడం లేదని రైతులు ఆరోపించారు. వరి పంటలు పూర్తిగా ఎండిపోకముందే అధికారులు స్పందించి తక్షణమే నీటి వసతి కల్పించడంతో పాటు పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.



## కోతుల బెడద నివారణకు ఉద్యమంలా సమగ్ర కార్యాచరణ: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: జిల్లాలో కోతుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పించేలా మున్సిపల్ కమిషనర్లు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నర్సాపూర్, తూప్రాన్, మెదక్ మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్షలో కోతుల బెడద నియంత్రణకు గత సమావేశంలో సూచించిన అంశాలపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ల నివేదికల ప్రకారం మెదక్ మున్సిపాలిటీలో సుమారు 3,000 కోతులు, నర్సాపూర్‌లో 2,000, తూప్రాన్‌లో 1,000, రామాయంపేటలో 500 వరకు కోతులు ఉన్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో సుమారు 6,500 కోతులు ఉన్నట్లు అంచనా నేపథ్యంలో సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని సూచించారు. కోతులను పట్టుకుని నిర్మల్ జిల్లాకు తరలించి, అవసరమైన ఆపరేషన్ అనంతరం అక్కడే విడిచిపెట్టే విధంగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. కోతుల బెడదను ఒక ఉద్యమంలా చేపట్టి దశలవారీగా చర్యలు అమలు చేస్తే జిల్లాలో సమస్యను గణనీయంగా నియంత్రించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు, రైతులకు కోతుల బెడద నుంచి ఉపశమనం కల్పించేందుకు అన్ని వర్గాల సహకారం అవసరమని, సమష్టి కృషితో మెదక్ జిల్లాను కోతుల నియంత్రణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.




## జీవో 97 రద్దు చేయాలంటూ గోమారం పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా

శివంపేట్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ నర్సాపూర్ నియోజకవర్గ ప్రతినిధి: జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా శివంపేట్ మండలం గోమారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి కళాశాల ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. జీవో 97 తమ విద్యాభ్యాసం, భవిష్యత్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయంపై నిరసన తెలిపారు. తరగతులకు హాజరుకాకుండా క్లాసులను బహిష్కరించిన అనంతరం కళాశాల ప్రాంగణంలో ఒకచోట చేరి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను వినిపించారు. జీవో 97 వల్ల విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశంపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. 'జీవో 97ను వెంటనే రద్దు చేయాలి', 'విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలి' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. తాము పాలిటెక్నిక్ విద్యను అభ్యసించి భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, తమ చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకపోతే నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి జీవో 97ను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే కళాశాల స్థాయి నుంచి ఆందోళనను మరింత విస్తృతం చేస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు.



## మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి.. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

నర్సాపూర్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ నర్సాపూర్ నియోజకవర్గ ప్రతినిధి: వినాయక నవరాత్రుల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పురపాలక సంఘం పరిధిలోని జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ ఆధ్వర్యంలో ఈకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాల వినియోగం వల్ల కలిగే పర్యావరణ ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాచునూరి లక్ష్మి రాజు యాదవ్ హాజరై విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అధికారులు వివరించారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుని కుటుంబ సభ్యులు, సమాజంలోని ప్రజలకు కూడా మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అంతారం సుధీర్ గౌడ్, మన్నే నిరంజన్ దాసు, పాఠశాల ప్రిన్సిపాల్ సామ్యా నాయక్, మున్సిపల్ మేనేజర్ వైట్ల మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి: పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్: వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతి, సామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు, ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీ సభ్యులు పోలీసు శాఖకు సహకరించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం శాంతి కమిటీ సభ్యులతో విగ్రహాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లు, శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో జరిగే ప్రధాన ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు ప్రచారాలను నమ్మకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, అనుమానాస్పద సమాచారం లేదా ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు పోలీసు, నగరపాలక సంస్థ, అగ్నిమాపక, నీటిపారుదల, వైద్య, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జన సమయంలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. శాంతి కమిటీ సభ్యులు పోలీసు శాఖతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు. వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సందర్భంగా అధికారులు నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా చూడాలని తెలిపారు. మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని పోలీస్ కమిషనర్ కోరారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మోహన్ బాబు, బాలకృష్ణ, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## కబడ్డీ పోటీల్లో గాయపడిన సింగూర్ విద్యార్థికి అండగా నిలిచిన ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు.. పరామర్శించిన ఎంఈఓ శంకర్

అందోల్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ఆందోల్ మండల ప్రతినిధి: పుల్కల్ మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా గురువారం రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో సింగూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి అలుగోల గంగాధర్ తీవ్రంగా గాయపడటంతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు మానవత్వంతో స్పందించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. రెసిడెన్షియల్ పాఠశాల, సింగూర్ జడ్పీహెచ్ఎస్ జట్ల మధ్య కబడ్డీ మ్యాచ్ జరుగుతున్న సమయంలో 10వ తరగతి చదువుతున్న గంగాధర్ భుజానికి తీవ్ర గాయం కావడంతో ఎముక విరిగింది. వెంటనే స్పందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, దత్తురావు, ప్రసాద్ శర్మలు ఈ విషయాన్ని మండల విద్యాధికారి శంకర్‌కు సమాచారం అందించి విద్యార్థిని సంగారెడ్డిలోని సిటీ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న సింగూర్ గ్రామ సర్పంచ్ నందికంటి శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఎర్ర శేఖర్ మండల విద్యాధికారి శంకర్‌తో మాట్లాడి విద్యార్థికి అవసరమైన వైద్యం, అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎంఈఓ శంకర్ తక్షణమే స్పందించి వైద్య ఖర్చుల విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విద్యార్థి తమ బాధ్యత అని భరోసా ఇచ్చి చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. విద్యార్థి కుటుంబ సభ్యులను గ్రామ ప్రజాప్రతినిధులు పరామర్శించి ధైర్యం చెప్పగా, రాత్రి సర్జరీ పూర్తయ్యే వరకు మండల విద్యాధికారి, ఆయన సిబ్బంది, ఉపసర్పంచ్ ఎర్ర శేఖర్, మైనార్టీ నాయకులు ముజీబ్, సర్పంచ్ నందికంటి శ్రీనివాస్ ఆసుపత్రిలోనే ఉండి విద్యార్థి తల్లిదండ్రులకు అండగా నిలిచారు. శుక్రవారం ఉదయం కూడా ఎంఈఓ శంకర్ సిటీ హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న గంగాధర్‌ను పరామర్శించి, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. విద్యార్థి వైద్య ఖర్చుల గురించి ఆందోళన చెందవద్దని, అతను తమ విద్యార్థి కావడంతో బాధ్యతగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విపత్కర పరిస్థితుల్లో తక్షణమే స్పందించి విద్యార్థికి అండగా నిలిచిన ఎంఈఓ శంకర్, ప్రహ్లాద్, సత్యం, యాదగిరి, ఇతర ఉపాధ్యాయులు, సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## విష్ణు ఉన్నత పాఠశాలలో ఘనంగా వినాయక చవితి, హిందీ భాషా దినోత్సవ వేడుకలు




నర్సాపూర్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ నర్సాపూర్ నియోజకవర్గ ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని విష్ణు ఉన్నత పాఠశాలలో వినాయక చవితి, హిందీ భాషా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ హిందీ కవి తులసీదాస్ చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. 1949 సెప్టెంబర్ 14న దేవనాగరి లిపిలోని హిందీ భాషను భారత రాజ్యాంగ పరిషత్ అధికార భాషగా గుర్తించిన సందర్భంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగజ్యోతి, హిందీ భాషా ఉపాధ్యాయులు హిందీ భాష ప్రాముఖ్యత, విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో భాషపై ఆసక్తిని పెంపొందించేందుకు వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించి పూజలు నిర్వహించారు. మట్టి విగ్రహాల వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వినాయక చవితి విశిష్టతను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. టీవీఆర్‌ఐటీ కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ బాపిరాజు, ఏవో సురేష్ సమక్షంలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించగా, పాఠశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది.

## భక్తుల కోరిక నెరవేర్చిన సర్పంచ్.. పాండురంగ మందిరానికి సొంత ఖర్చులతో మైక్ సెట్



మానూర్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: మానూర్ మండల పరిధిలోని తోర్నాల్ గ్రామ ఎస్సీ కాలనీలో ఉన్న పాండురంగ మందిరానికి భక్తుల సౌకర్యార్థం గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ తన సొంత ఖర్చులతో మైక్ సెట్‌ను అందజేశారు. పాండురంగ మందిరం కమిటీ సభ్యులు, భక్తులు ఎన్నో రోజులుగా మైక్ సెట్ ఏర్పాటు చేయాలని కోరుతుండగా, వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ స్వయంగా మైక్ సెట్‌ను సమకూర్చారు. మైక్ సెట్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పండరినాథ్ భక్తులు సంగమేశ్వర్ పాటిల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగారెడ్డి పటేల్, ఉపసర్పంచ్ వినోద్ అంబోజి, మెట్టు నర్సింలు, రాహుల్ పటేల్, విజేందర్ రెడ్డి, అర్జున్, సంగయ్య స్వామి, శేఖర్, హఫీజ్, కేకే నర్సింలు, గణపతి, పుండ్లిక్, శరణప్ప, సతీష్‌తో పాటు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్పంచ్ సేవలను అభినందించారు.




## కాడాస్ట్రల్ రీ-సర్వేను నిర్దేశిత గడువులో అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: జిల్లాలో కొనసాగుతున్న కాడాస్ట్రల్ రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, మెదక్ ఆర్డీఓ రమాదేవి, నర్సాపూర్ ఆర్డీఓ రామకృష్ణ, తూప్రాన్ ఆర్డీఓ బావయ్య, సంబంధిత తహసీల్దార్లు, సర్వేయర్లతో కలిసి కాడాస్ట్రల్ రీ-సర్వే పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 10 గ్రామాల్లో సుమారు 13 వేల ఎకరాల్లో రీ-సర్వే ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, భూ రికార్డుల విషయంలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా పకడ్బందీగా పనులు చేపట్టాలని సూచించారు. సర్వే బృందాల రోజువారీ పనితీరు, ప్రతి బృందం సాధిస్తున్న పురోగతి, రోజువారీగా పూర్తి చేస్తున్న విస్తీర్ణం తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాడాస్ట్రల్ రీ-సర్వే ద్వారా భూ రికార్డులను శాస్త్రీయంగా, పారదర్శకంగా రూపొందించేందుకు వీలుంటుందని, భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తూనే సర్వేలో ఖచ్చితత్వానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సంబంధిత తహసీల్దార్లు, అధికారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం చేస్తే సహించం: నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలపై ఆగ్రహం

నాగులవంచ, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్: నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల విద్యార్థులు చేపట్టిన ధర్నా, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై కళాశాల పూర్వ విద్యార్థులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు కళాశాలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా కళాశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టు బోధన సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను 2024లోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. చదువుకోవాలనే తపనతో సమస్యలను భరిస్తున్న విద్యార్థులపై వ్యక్తిగత వేధింపులకు పాల్పడటం, అనుచిత వ్యాఖ్యలు చేయడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంబంధిత ఇంగ్లీష్ అధ్యాపకుడిపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు తేల్చి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కళాశాలలో రాజకీయ జోక్యం తీసుకురావడం సరికాదని, సరస్వతి నిలయంగా భావించే విద్యాసంస్థలో పనిచేస్తున్న ఇతర అధ్యాపకుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా లేదా ఎగతాళి చేసేలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. విద్యార్థులకు, ఒక అధ్యాపకుడికి మధ్య చోటుచేసుకున్న అంశాన్ని రాజకీయంగా మలచి అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేయవద్దని స్పష్టం చేశారు. కళాశాలలో కులాల పంచాయతీలు, సిబ్బంది మధ్య వర్గపోరు వంటి అంశాలను తెరపైకి తీసుకురావడం ద్వారా విద్యార్థుల అసలు సమస్యలను మరుగునపడేయడం సరికాదన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తూ సంబంధిత అధ్యాపకుడిని కాపాడేందుకు రాజకీయాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. తమ వైఖరి మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నిస్వార్థంగా పనిచేస్తున్న అధ్యాపకులపై ఎలాంటి దాడులు జరిగినా సహించబోమని పేర్కొన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతిష్ఠను కాపాడటంతో పాటు విద్యార్థులకు న్యాయం జరిగేలా జిల్లా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాలలో జరిగిన పరిణామాలపై జిల్లా విద్యాశాఖ అధికారులను కలిసి వివరించామని, అధికారులు సానుకూలంగా స్పందించి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి తప్పు చేసిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. సమావేశంలో బీఎస్పీ మధిర నియోజకవర్గం ఇన్‌చార్జి దారెల్లి రమేష్, సర్పంచ్ వీరబాబు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాగయ్య నారపోగు, ఎంఆర్‌పీఎస్ చింతకాని మండల మాజీ అధ్యక్షుడు గుండ్ల రాంబాబు, స్వేరో మధిర నియోజకవర్గం అధ్యక్షుడు శ్యామ్, బోనకల్ మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మాగి ముకేశ్, ఎంఆర్‌పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగేంద్రబాబు నారపోగు, మండల ఎస్సీ సెల్ నాయకుడు దర్శ బాలకృష్ణ, బీఆర్ఎస్ మండల నాయకుడు ఐతం ఆదినారాయణ, ఎస్టీ సెల్ మండల నాయకుడు కొమ్ము క్రిష్ణ, జొన్నలగడ్డ పుల్లారావు, కొమ్ము నరేష్, కోట వెంకట రత్నం, చెట్టిపోగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు యూనిఫాం, షూలు పంపిణీ చేసిన సర్పంచ్ ఆళ్ల మణి

చింతకాని, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్: తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధిని లక్ష్యంగా అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సీతంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు గ్రామ సర్పంచ్ ఆళ్ల మణి–పానకాలరావు శుక్రవారం యూనిఫాం, షూలను పంపిణీ చేశారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ చదువులో రాణించాలని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాల రమేష్, పాఠశాల హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఎక్స్‌పోజర్ విజిట్: డీఈఓ ఎస్. రాజు

మెదక్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: మెదక్ జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన 63 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 63 మంది తల్లిదండ్రులు, 18 మంది IERPs, 13 మంది కేర్‌గివర్లు, 4 మంది విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది కలిపి మొత్తం 148 మంది మూడు బస్సుల్లో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు కేవలం ఇంటి పరిసరాలకే పరిమితం కాకుండా బయట ప్రపంచాన్ని కూడా పరిచయం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఎక్స్‌పోజర్ విజిట్ల ద్వారా విద్యార్థుల్లో ఉన్న భయం, సంకోచం తగ్గడంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం, వివిధ వ్యక్తులను కలవడం ద్వారా వారి సామాజిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలు, ఇతర ప్రతిభా సామర్థ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులు సమాజంతో మరింత కలిసిమెలిసి ఉండేందుకు, భవిష్యత్తులో ధైర్యంగా ముందుకు సాగేందుకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ కె. రాజు, IERPs, కేర్‌గివర్లు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నాగులవంచ–తిమ్మినేనిపాలెం రోడ్డు నిర్మాణంలో అవకతవకలు లేవు: ఆర్‌అండ్‌బీ అధికారుల స్పష్టత

చింతకాని, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్: ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని నాగులవంచ నుంచి తిమ్మినేనిపాలెం (గణేష్ డొంక) వరకు కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులపై వస్తున్న వార్తల నేపథ్యంలో రహదారులు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) అధికారులు స్పందించారు. శుక్రవారం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్డు నిర్మాణ పనులను, వాటి నాణ్యతను నిశితంగా పరిశీలించారు. ఇటీవల కొన్ని పత్రికల్లో అర్ధరాత్రి ఆగమేఘాల మీద రోడ్డు పనులు చేపడుతున్నారంటూ వచ్చిన కథనాలపై అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేవని, నిబంధనలకు అనుగుణంగానే పనులు సక్రమంగా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించామని, పనుల నాణ్యతపై తాము పూర్తి సంతృప్తితో ఉన్నామని వెల్లడించారు. ఈ విషయంలో ఎలాంటి అవకతవకలకు తావులేదని, ప్రజలు, వాహనదారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన రహదారిని అందుబాటులోకి తీసుకురావడానికి పనులు కొనసాగిస్తున్నామని ఆర్‌అండ్‌బీ అధికారులు భరోసా ఇచ్చారు.

## బీసీ కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలి.. ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలి: బీసీ సంక్షేమ సంఘం



సంగారెడ్డి, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బీసీల జనాభాను శాస్త్రీయ, పారదర్శక పద్ధతిలో లెక్కించాలని బీసీ సంక్షేమ సంఘం సంగారెడ్డి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బీసీలను సమగ్రంగా నమోదు చేయకుండా, ప్రత్యేక బీసీ కాలమ్ ఏర్పాటు చేయకుండా, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించకుండా కులగణన నిర్వహిస్తే బీసీలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల ఖచ్చితమైన జనాభా గణాంకాలు అందుబాటులోకి రావాలంటే ప్రతి బీసీ కుటుంబాన్ని, ప్రతి కులాన్ని శాస్త్రీయంగా నమోదు చేయాలని కోరారు. జనాభా ఆధారంగా విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లలో న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం బీసీ సంక్షేమ సంఘం సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట "బీసీల ధర్మ పోరాట దీక్ష" నిర్వహించారు. దీక్షలో బీసీ నాయకులు, విద్యార్థి, యువజన నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. కులగణనలో ప్రత్యేక బీసీ కాలమ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి బీసీ కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని, ప్రతి బీసీ కుటుంబాన్ని ఖచ్చితంగా లెక్కించాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభాకు సంబంధించిన కచ్చితమైన గణాంకాలు లేకుండా భవిష్యత్తులో బీసీలకు సముచిత న్యాయం చేయడం సాధ్యం కాదని తెలిపారు. బీసీల భవిష్యత్ తరాలకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి శాస్త్రీయమైన, పారదర్శకమైన బీసీ కులగణన నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం సంగారెడ్డి జిల్లా నాయకులు కోరారు. దీక్షలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, ఆర్‌సీ పురం మాజీ కార్పొరేటర్ పుష్పా నాగేష్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సుకూరి జగదీశ్వర్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గొరుగంటి రమేష్, బాలు యాదవ్, లాడే మల్లేష్, యాదగిరి, ప్రభు గౌడ్, రామ నారాయణ, శ్రీనివాస్ గౌడ్, పద్మారావు, నాగరాజ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## బోరంచ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం

మానూర్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామ ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీవాసులు తమ తాగునీటి సమస్యను గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎంపీ, ఎమ్మెల్యే సూచనల మేరకు సర్పంచ్ పంచగామ బీరప్ప స్వయంగా దగ్గరుండి బోర్ మోటార్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించడంతో ఎస్సీ కాలనీ ప్రజలకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపిన ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి, సర్పంచ్ పంచగామ బీరప్పకు కాలనీవాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువత, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో హనుమాన్ ఆలయంలో సప్తాహ అభిషేకం, అర్చన పూజలు

మెదక్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: రాయికోడ్ మండల పరిధిలోని రాయిపల్లి గ్రామ హనుమాన్ ఆలయ ఆవరణలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న సప్తాహ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఆరో రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాలిపట్లోళ్ల పుష్పవతి-ధనుంజయ పాటిల్ దంపతులు హనుమాన్ స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అర్చన, పూజా కార్యక్రమాలను భక్తిపారవశ్యంతో నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. కార్యక్రమంలో మాలిపట్లోళ్ల సువర్ణ పాటిల్, నందిత పాటిల్, ఆలయ అర్చకులు సంగయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: డీసీహెచ్ఎస్ డాక్టర్ శివ దయాల్

మెదక్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రుల సమన్వయకర్త, డీసీహెచ్ఎస్ డాక్టర్ శివ దయాల్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం తూప్రాన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలోని వ్యాక్సిన్ గది, ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్ వార్డు, ల్యాబొరేటరీ, ఫార్మసీ, కిచెన్ తదితర విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న సుమారు 50 మంది రోగులకు చికిత్స అందించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 150 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి టీ-హబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించినట్లు వెల్లడించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని, రోగులకు అందిస్తున్న ఆహారం, ఆసుపత్రి పరిశుభ్రత సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్ సింగ్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కబడ్డీ పోటీల్లో విద్యార్థికి తీవ్ర గాయం.. అండగా నిలిచిన ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

సంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ పుల్కల్ మండల ప్రతినిధి మహేష్ బాబు: పుల్కల్ మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో సింగూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి అలుగోల గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో రెసిడెన్షియల్ స్కూల్, సింగూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ జట్ల మధ్య కబడ్డీ పోటీ జరుగుతున్న సమయంలో గంగాధర్ భుజానికి తీవ్ర గాయం కావడంతో ఎముక విరిగింది. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, దత్తురావు, ప్రసాద్ శర్మ వెంటనే స్పందించి మండల విద్యాధికారి శంకర్‌కు సమాచారం అందించారు. అనంతరం విద్యార్థిని హుటాహుటిన సంగారెడ్డిలోని సిటీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న సింగూర్ గ్రామ సర్పంచ్ నందికంటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎర్ర శేఖర్ తదితర ప్రజాప్రతినిధులు ఎంఈఓ శంకర్‌తో మాట్లాడి విద్యార్థికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఈఓ శంకర్ తక్షణమే స్పందించి విద్యార్థి వైద్య ఖర్చుల విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించి చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేయించారు. విద్యార్థికి శస్త్రచికిత్స జరుగుతున్న సమయంలో రాత్రి వరకు ఎంఈఓ, ఆయన సిబ్బంది, ఉప సర్పంచ్ ఎర్ర శేఖర్, మైనార్టీ నాయకులు ముజీబ్, సర్పంచ్ నందికంటి శ్రీనివాస్ ఆసుపత్రిలోనే ఉండి విద్యార్థి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అనంతరం శుక్రవారం ఉదయం ఎంఈఓ శంకర్ మరోసారి సిటీ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థి గంగాధర్‌ను పరామర్శించారు. వైద్య ఖర్చుల గురించి ఆందోళన చెందవద్దని, విద్యార్థి తమ బాధ్యత అని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆపద సమయంలో వెంటనే స్పందించి విద్యార్థికి అండగా నిలిచిన ఎంఈఓ శంకర్‌తో పాటు ప్రహ్లాద్, సత్యం, యాదగిరి తదితర ఉపాధ్యాయులు, సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.







## మాజీ మంత్రి హరీశ్ రావుకు మట్టి వినాయక విగ్రహం అందజేత

హైదరాబాద్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావును బీఆర్ఎస్వీ నాయకుడు అఖిల్ మర్యాదపూర్వకంగా కలిసి మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని ఈ సందర్భంగా అఖిల్ కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని సూచించారు. మట్టి విగ్రహాల వినియోగం ద్వారా నిమజ్జనం సమయంలో నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పేర్కొన్నారు. మట్టి వినాయక విగ్రహాన్ని స్వీకరించిన హరీశ్ రావు పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో అసద్, అడ్నాన్, సబీల్ తదితరులు పాల్గొన్నారు.




## మొబైల్ నంబర్ ఇవ్వలేదని కళ్లద్దాలు విక్రయించలేదని ఆరోపణ

సంగారెడ్డి, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఉన్న లెన్స్‌కార్ట్ షోరూమ్‌లో మొబైల్ నంబర్ ఇవ్వలేదనే కారణంతో కళ్లద్దాలు విక్రయించేందుకు సిబ్బంది నిరాకరించారని ఓ వినియోగదారుడు ఆరోపించారు. కళ్లద్దాలు కొనుగోలు చేసేందుకు షోరూమ్‌కు వెళ్లిన సమయంలో సిబ్బంది మొబైల్ నంబర్ అడిగారని, వ్యక్తిగత కారణాల దృష్ట్యా నంబర్ ఇవ్వలేనని చెప్పినప్పటికీ కళ్లద్దాలు కొనుగోలు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపానని వినియోగదారుడు పేర్కొన్నారు. అయితే మొబైల్ నంబర్ ఇవ్వకపోతే కళ్లద్దాలు విక్రయించలేమని సిబ్బంది చెప్పినట్లు ఆయన ఆరోపించారు. వస్తువు కొనుగోలు చేసే సమయంలో వినియోగదారుడి నుంచి మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా తీసుకోవాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వినియోగదారుల వ్యక్తిగత సమాచార గోప్యతను గౌరవించాలని కోరుతూ సంబంధిత అధికారులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ విభాగం ఈ ఘటనపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, వినియోగదారుడు చేసిన ఆరోపణలపై లెన్స్‌కార్ట్ షోరూమ్ నిర్వాహకుల వివరణ తెలియాల్సి ఉంది.



## వీఆర్ఏలకు న్యాయం చేయాలి.. ఇమామ్‌లు, మౌజంల బకాయిలు వెంటనే చెల్లించాలి: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హైదరాబాద్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రాష్ట్రంలోని వీఆర్ఏలు, ఇమామ్‌లు-మౌజంలు, పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసనమండలిలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఆర్ఏల సమస్యలపై మాట్లాడుతూ కుటుంబ సభ్యులు వంతులవారీగా విధులు నిర్వహించిన కారణంగా ఉద్యోగాల కేటాయింపులో ఏర్పడిన సాంకేతిక సమస్యలను పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంచడం సమంజసం కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,797 కుటుంబాలు ఈ సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని, 479 మంది బాధిత వీఆర్ఏలు హైకోర్టులో 11 రిట్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ ఏడాది గడిచినా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ప్రశ్నించారు. బాధిత వీఆర్ఏలకు తక్షణమే న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఇమామ్‌లు, మౌజంల గౌరవ వేతనాల అంశాన్ని ప్రస్తావిస్తూ 2024–25లో గౌరవ వేతనాల కోసం రూ.106 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం 2026–27లో కేటాయింపులను రూ.40 కోట్లకు పరిమితం చేయడంపై ఆయన ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 15,845 మంది ఇమామ్‌లు, మౌజంలకు మూడు నెలలుగా గౌరవ వేతనాలు అందడం లేదని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచడంతో పాటు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెల మొదటి తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకుల సమస్యలపై మాట్లాడుతూ జీవో నంబర్ 97 కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నెలకొన్నదని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్ వ్యవస్థను తీసుకురావడం వల్ల భవిష్యత్తులో స్కాలర్‌షిప్‌లు నిలిచిపోవడం, ఫీజులు పెరగడం, అధ్యాపకులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ అంశంపై వందలాది మంది విద్యార్థులు తనకు వినతిపత్రాలు అందజేశారని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పనితీరుపై కూడా ఆయన విమర్శలు చేశారు. విశ్వవిద్యాలయంలో సరైన మౌలిక వసతులు లేవని, సిబ్బంది కొరత ఉందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆందోళనకు కారణమవుతున్న జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేసి, పాత విధానంలోనే పాలిటెక్నిక్ విద్య కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## జీవో 97ను రద్దు చేయాలి.. పాత విధానంలోనే పాలిటెక్నిక్ విద్య కొనసాగించాలి: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హైదరాబాద్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97 కారణంగా రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసనమండలిలో పేర్కొన్నారు. జీవో 97ను రద్దు చేయాలని కొంతకాలంగా విద్యార్థులు ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని బలోపేతం చేసే పేరుతో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను దెబ్బతీసే పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ అంశంపై రాష్ట్రంలోని పలువురు విద్యార్థులు తనను కలిసి వినతిపత్రాలు సమర్పించారని వెల్లడించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పనితీరుపై కూడా మల్లన్న విమర్శలు చేశారు. విశ్వవిద్యాలయంలో అవసరమైన స్థాయిలో సిబ్బంది లేరని, ప్రస్తుతం కేవలం ఐదుగురు సిబ్బందితోనే వ్యవస్థ కొనసాగుతోందని ఆరోపించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేసి, గతంలో కొనసాగిన విధానంలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు.




## నేటి నుంచి ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు.. ఏడేళ్ల తర్వాత భారత్‌లో జిన్‌పింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేటి నుంచి న్యూఢిల్లీలో ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ మండపంలో రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు బ్రిక్స్‌లోని 11 సభ్య దేశాల నేతలు, ప్రతినిధులు హాజరవుతున్నారు. ప్రస్తుతం బ్రిక్స్‌లో బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, భారత్, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సభ్య దేశాలుగా ఉన్నాయి. ఈ 11 దేశాలు కలిపి ప్రపంచ జనాభాలో సుమారు 49.5 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 26 శాతం వాటాను కలిగి ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

భారత్ 2026లో నాలుగోసారి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టింది. "బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ" అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ ఏడాది బ్రిక్స్ కార్యక్రమాలను భారత్ నిర్వహిస్తోంది. ప్రపంచ దక్షిణ దేశాల ప్రయోజనాలు, ఆర్థిక సహకారం, వాణిజ్యం, సాంకేతికత, వాతావరణ మార్పులు, స్థిరమైన అభివృద్ధి, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు, రాజకీయ-భద్రతా అంశాలు తదితరాలపై నేతలు చర్చించే అవకాశం ఉంది. బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ సమస్యలపై సమన్వయంతో వ్యవహరించే అంశాలపై కూడా సదస్సులో చర్చ జరగనుంది.

ఈ సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరవుతుండటం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఏడేళ్ల తర్వాత ఆయన భారత్‌లో అడుగుపెడుతున్నారు. జిన్‌పింగ్ చివరిసారిగా 2019లో మహాబలిపురంలో ప్రధాని నరేంద్ర మోదీతో అనధికారిక భేటీలో పాల్గొన్నారు. అనంతరం 2020 గల్వాన్ ఘర్షణతో భారత్-చైనా సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య సంబంధాలను క్రమంగా మెరుగుపర్చే ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో జిన్‌పింగ్ పర్యటనపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. ప్రధాని నరేంద్ర మోదీ, జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీకి కూడా ఏర్పాట్లు జరుగుతున్నట్లు చైనా విదేశాంగ శాఖ వెల్లడించింది. సరిహద్దు పరిస్థితి, ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు, ఇరుదేశాల సంబంధాల సాధారణీకరణ వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తదితర ప్రముఖ నేతలు కూడా సదస్సుకు హాజరవుతున్నారు. ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య పరిణామాలు, అమెరికా-చైనా సంబంధాలు వంటి అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశాలకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. బ్రిక్స్ విస్తరణ అనంతరం సభ్య దేశాల మధ్య విభిన్న రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు ఉన్నప్పటికీ వాణిజ్యం, ప్రత్యామ్నాయ చెల్లింపు వ్యవస్థలు, ఆర్థిక సహకారం, గ్లోబల్ గవర్నెన్స్ వంటి అంశాల్లో సమన్వయం పెంచుకోవడంపై దృష్టి సారించే అవకాశం ఉంది.

ఢిల్లీలో భారీ భద్రత.. ట్రాఫిక్ ఆంక్షలు

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. భారత్ మండపం, ప్రముఖ హోటళ్లు, వీవీఐపీల ప్రయాణ మార్గాల్లో బహుళస్థాయి భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎన్‌ఎస్‌జీ, స్వాట్ కమాండోలు, సీసీటీవీ కెమెరాలు, యాంటీ డ్రోన్ వ్యవస్థలతో నిఘా పెంచినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. సదస్సు నేపథ్యంలో నగరంలోని కీలక మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపులు అమలు చేస్తున్నారు. ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికే పలు మార్గాలకు సంబంధించి ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీలను విడుదల చేశారు.

సదస్సు నేపథ్యంలో సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఆంక్షలు, మార్గమళ్లింపులు అమల్లో ఉన్నాయి. వీవీఐపీ రాకపోకల సమయంలో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నియంత్రించే అవకాశం ఉండటంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీలోని ప్రజలు, ప్రయాణికులు అధికారిక ట్రాఫిక్ సూచనలు పాటించాలని పోలీసులు కోరుతున్నారు.

ఈ బ్రిక్స్ సదస్సు భారత్‌కు దౌత్యపరంగా కూడా కీలకంగా మారింది. ఒకవైపు రష్యా, చైనా, ఇరాన్ వంటి దేశాలతో వ్యూహాత్మక సంబంధాలను కొనసాగిస్తూ, మరోవైపు అమెరికా, యూరప్ దేశాలతో భారత్ తన సంబంధాలను బలోపేతం చేస్తున్న నేపథ్యంలో న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ సమావేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా మోదీ-జిన్‌పింగ్ భేటీ జరిగితే భారత్-చైనా సంబంధాలపై దాని ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై అంతర్జాతీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.




## ఖైరతాబాద్‌లో నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు.. 24 వరకు కొనసాగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఖైరతాబాద్ మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన, దర్శనానికి భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఖైరతాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, వాహనాల దారి మళ్లింపులు అమలు చేయనున్నారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు పరిస్థితిని బట్టి ట్రాఫిక్‌ను నియంత్రించనున్నారు. పీవీ విగ్రహం వైపు నుంచి మింట్ కాంపౌండ్ వైపు వచ్చే వాహనాలను రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నిరంకారి జంక్షన్ వైపు మళ్లిస్తారు. రాజ్‌దూత్ లేన్ మీదుగా బడా గణేశ్ వైపు వెళ్లే వాహనాలను ఇక్బాల్ మినార్ వైపు దారి మళ్లించనున్నారు. మింట్ కాంపౌండ్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలను సెక్రటేరియట్ ఎక్స్ రోడ్డు వైపు మళ్లిస్తారు. నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలను సెక్రటేరియట్ జంక్షన్ లేదా ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు మళ్లించనున్నారు. అలాగే నిరంకారి జంక్షన్ నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలపై కూడా ఆంక్షలు ఉంటాయి. ఖైరతాబాద్ పోస్ట్ ఆఫీస్ లేన్ నుంచి రైల్వే గేట్ వైపు వెళ్లే వాహనాలను పాత పీఎస్ సైఫాబాద్ జంక్షన్ వైపు మళ్లిస్తారు. ఖైరతాబాద్, షాదాన్ కాలేజ్, అయోధ్య, నిరంకారి, పాత పీఎస్ సైఫాబాద్, మింట్ కాంపౌండ్, ఎన్టీఆర్ మార్గ్, సెక్రటేరియట్ జంక్షన్, నెక్లెస్ రోటరీ, కేసీపీ జంక్షన్, మాసాబ్ ట్యాంక్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు వీలైనంత వరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. మహాగణపతి దర్శనానికి వచ్చే భక్తుల కోసం రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ జంక్షన్ వైపు నుంచి వచ్చే భక్తులు విశ్వేశ్వరయ్య భవన్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్‌ను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ట్రాఫిక్ పరిస్థితిని బట్టి ఆంక్షలు, దారి మళ్లింపుల్లో మార్పులు చేసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. అత్యవసర ట్రాఫిక్ సహాయం కోసం 9010203626 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.